క్లుప్తంగా

నేడు, రేపు పత్తి కొనుగోళ్లు బంద్

నేరడిగొండ/బోథ్: మండల కేంద్రంలోని దర్శన జిన్నింగ్ మిల్లులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా సోమ, మంగళవారాల్లో పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి దేవన్న ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి బుధవారం నుంచి కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జనవరి 1న శౌర్య దివస్


మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రంలో జనవరి 1న భీమా కోరేగావ్ 205వ శౌర్య దివస్ నిర్వహించనున్నట్లు అంబేద్కర్ అసోసియేషన్ ఉట్నూర్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జగ్జీవన్, కాంబ్లే ప్రజ్ఞశీల్‌లు తెలిపారు. భీమా కోరేగావ్ అమరవీరులకు నివాళులర్పించేందుకు దళిత, ఆదివాసీలు, బహుజనులు తరలిరావాలని కోరారు. సమావేశంలో స్వామి, బొంకంటి సుభాష్, టిబోతే, అకాశ్, బండి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న గ్రామస్తులు

నేరడిగొండ: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ ఎమ్మెల్యేగా గెలవాలని మండలంలోని బుగ్గారం(బి) గ్రామ యువజన సంఘం సభ్యులు మొక్కుకున్నారు. అనిల్ జాదవ్ భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆదివారం పొరఘడ్ జగదాంబ దేవి, శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో మొక్కు తీర్చుకున్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కడ్తాల్ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి పల్లకిని దర్శించుకున్నారు. అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొనడంతో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఎమ్మెల్యే వెంట బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వాములు ఉన్నారు.

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

ఎదులాపురం: వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిపారు. కేక్‌కట్ నాయకులు తినిపించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెందూర్ మనోహర్, కోఆర్డినేటర్ సర్సం రాహుల్, జిల్లా యువజన అధ్యక్షుడు కృష్ణంరాజు, మాణిక్ రావు, ఉగ్గే శ్రీను, విజయ్ శ్రీను పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

నేరడిగొండ: గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని సర్పంచ్ గీత అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే డ్రెయినేజీ శుభ్రతతో పాటు ఏ సమస్యలు ఎదురుకాకుండా చూస్తానని తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూసీ అనుబంధం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జీపీ కార్మికుల సమ్మె సందర్భంగా కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందులో జీపీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆశన్న, యకులు అడెల్లు, పోశెట్టి లక్ష్మన్న, ఇంద్రజ, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

ఎదులాపురం: ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు జిల్లా కమిటీతో పాటు మండల కమిటీలను ఎన్నుకున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కదరపు ప్రవీణ్ మాదిగ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వివరాలు వెల్లడించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గజ్జల కాంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేశ్, ఊషన్న, బేల, జైనథ్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, బోథ్ మండలాల అధ్యక్షులుగా అక్షయ్, గజానన్, జయేందర్, పోశన్న, కృష్ణలను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

వేతనాల చెల్లింపులో జాప్యం

- ఇబ్బంది పడుతున్న అన్‌స్కిల్డ్ వర్కర్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


బేల మార్కెట్ కూడలిలో ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేస్తున్న అన్‌స్కిల్డ్ వర్కర్స్

బేల: విద్యుత్ అంతరాయ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అనుబంధ తెలంగాణ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ సొసైటీ ఆదిలాబాద్ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ వర్కర్లకు వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు. వేతనాలు నెల నెల రావడం లేదని, వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని, ఇచ్చే వేతనాల్లోనూ కోత విధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారుల పట్టింపులేకపోవడంతో జాప్యం అవుతున్నాయని వాపోతున్నారు. ఇదిలా ఉండగా.. వీరంతా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌ల పర్యవేక్షణలో బ్రేక్‌డౌన్ సమయంలో స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారానికి పని చేస్తారు. దీంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ లేని సమయంలో ఆపరేటర్‌గా విధులు సైతం నిర్వర్తిస్తారు. ఇంటింటికీ వెళ్లి ప్రతినెల విద్యుత్ మీటరు బిల్లు రీడింగ్, బిల్లుల వసూలులోనూ కీలకంగా పని చేస్తారు. కాని వేతనాలు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్నారని వారు వాపోతున్నారు.

వేతనాలు ఎప్పుడు వస్తాయో?

అన్‌స్కిల్డ్ వర్కర్లకు నెల నెల వేతనాలు రావడం లేదు. గత ఆగస్టు నుంచి వేతనాలు పెండింగ్ ఉండగా.. డిసెంబర్ పూర్తయితే ఐదు నెలల వేతనాలు రావాల్సి ఉంటుంది. ఈ వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. వేతనాల విషయమై అధికారులను అడిగితే రేపు, మాపు వస్తాయని సమాధానం దాట వేస్తున్నారని బాధిత వర్కర్లు పేర్కొంటున్నారు.

వేతనాల్లోనూ కోతలు..

జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజన్‌లు ఉన్నాయి. ఈ పరిధిలో ఆదిలాబాద్ టౌన్, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ సబ్ డివిజన్‌లు ఉండగా.. 20 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తంగా 94మంది విలేజ్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి సొసైటీ నుంచి ప్రతి నెల రూ.15,630 ఉంటుంది. ఈసీఎఫ్, ఐఎస్ఎఫ్ పోను రూ.11,730 వరకు వేతనం రావాల్సి ఉంటుంది. కాని ఈ వేతనాల్లో కోతలు విధించి, బ్యాంకు ఖాతా ద్వారా కేవలం 8,400 మాత్రమే చెల్లిస్తున్నారు. వేతనాల తక్కువపై సొసైటీ నిర్వాహకులను ప్రశ్నిస్తే రూ.10,900 కు పెంచుతామని చెబుతున్నారని, పెంచిన వేతనం ఇంకెప్పుడు ఇస్తారో తెలియడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు చెల్లించాలి



ఆగస్టు నెల నుంచి మాకు వేతనాలు రావడం లేదు. సొసైటీ వారి ఆలసత్వంతో వేతనాలు నెలల తరబడి పెండింగ్ అవుతున్నాయి. దీనిపై అధికారులు పట్టింపులేకపోవడంతో సొసైటీ వారు వేతనాల చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారు. జిల్లా ఆఫీసర్లు వేతనాల చెల్లింపు జాప్యంపై స్పందించాలి.
– హబీబ్, అన్‌స్కిల్డ్ వర్కర్

ప్రతిసారి పెండింగ్



సొసైటీ నుంచి వచ్చే వేతనాలు ప్రతిసారి నెలల తరబడి పెండింగ్ అవుతున్నాయి. వేతనాలు సకాలంలో రావడం లేదు. దీంతో ప్రతినెల ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కుటుంబ పోషణ భారం అవుతోంది. ఆఫీసర్లను అడిగితే రేపు, మాపు వస్తాయని చెబుతున్నారు.
– లక్ష్మణ్, అన్‌స్కిల్డ్ వర్కర్

కాలిన పత్తి ఎవరిది?


జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదంలో కాలిన పత్తి (ఫైల్)

నేరడిగొండ: మండలకేంద్రంలోని దర్శన జిన్నింగ్ మిల్లులో శనివారం సాయంత్రం పత్తి కుప్పకు నిప్పంటుకొని కాలిపోయింది. అయితే ఇచ్చోడ అగ్నిమాపక శకటం ద్వారా మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలానికి పోలీసులు సైతం వచ్చారు. కానీ కాలిపోయిన పత్తికి సంబంధించి ఇప్పటికే పోలీసుస్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు. ఈ విషయమై సీసీఐ అధికారులను అడిగితే మా పత్తి కాలలేదని చెబుతున్నారు. అసలు కాలిపోయిన పత్తి ఎవరిదోనన్న ప్రశ్న తలెత్తుతోంది. అలాగే బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్నను వివరణ కోరగా ఆ జిన్నింగ్ మిల్లుకు సంబంధించి సీసీఐ అధికారులకే తెలియాలని, తమకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. ఏదేమైనా ప్రమాదం జరిగి పత్తి కాలిపోతే అసలు అది ఎవరిదని పలువురు చర్చించుకుంటున్నారు. పత్తి కాలిపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

31న మేరు సంఘం కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 31న మేరు సంఘం ఆదిలాబాద్ పట్టణ నూతన కార్యవరాన్నిఎన్నుకోనున్నట్లు సంఘం అడహక్ కమిటీ ఎన్నికల అధికారి రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. ఎన్నికలను ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో రుక్మిణి విఠలేశ్వర్ ఆలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 22 నుంచి నామినేషన్‌లు స్వీకరించడం జరుగుతుందన్నారు. 26న ఉపసంహరణ అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు. 31న ఎన్నికలు, ఆదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల అధికారులుగా పోలిపెల్లి గజానన్, పోలిపెల్లి నాందేవ్‌లు వ్యవహరించడం జరుగుతుందని పేర్కొన్నారు. నామినేషన్లను ఎన్నావార్ రాజు, రాంపర్తి మల్లేశంలు స్వీకరించడం జరుగుతుందన్నారు. మేరు కులస్తులు గమనించి ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం: సాయి వైకుంఠట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత మగ్గం, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణను సద్వినియోగించుకోవాలని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్, మేనేజింగ్ డైరెక్టర్ వాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రస్ట్ భవనంలో ఆదివారం ఉచిత శిక్షణ ప్రారంభించారు. గత ఐదు ఏళ్లగా ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 1500 మంది మహిళలకు ఉచిత మగ్గం, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణ అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు నవీన్ యాదవ్, శ్రీనివాస్, చిక్కాల రవి కిరణ్, స్వప్నిల్, శిక్షకులు పెందూర్ లక్ష్మి, అందుగుల శ్రావణి, పూజ రాథోడ్, ఓరుగంటి వీణ, మెట్పల్లి హరీష్, సతీష్ పాల్గొన్నారు.

'పదేళ్ల పాలనలో జిల్లాకు అన్యాయం'


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: పదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో జిల్లాకు అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి రఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. జిల్లాలో గత పదేళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయన్నారు. సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ రీఓపెనింగ్‌కి మోక్షం లభించలేదన్నారు. ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, గిరిజన యూనివర్సిటీ, రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ, తాంసి బస్టాండ్ ఫ్లెటైవర్ బ్రిడ్జి ఇలా ఏ ఒక్కటి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. సీపీఐ పొత్తుతో కూడిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఆరు గ్యారంటీ అమలు, స్థానిక సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్, సీనియర్ నాయకులు షేక్ పాషా, పెద్ది నర్సింహులు, కామ్లే రాందాస్, దత్తు, నర్సింగ్ రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం


కార్యాలయానికి వేసిన రంగులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్తాబవుతుంది. పట్టణంలోని కై లాస్‌నగర్‌లో గల కార్యాలయాన్ని అన్ని హంగులతో అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జోగు రామన్న ఇక్కడి నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహించారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాయల్ శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ముస్తాబు చేస్తున్నారు. కొత్త సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వంద రోజుల అమలు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఝరీ గ్రామంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే ప్రజల తరుపున పోరాటం చేస్తామన్నారు. డిసెంబర్ 9న రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడం జరిగిందని, ఇప్పటికీ ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గొడం నగేశ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మండల కన్వీనర్ వెంకటేశ్, కేదారేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అభిరాంరెడ్డి, పోతరెడ్డి, ఆశన్న యాదవ్, వామన్, రమాకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్


అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న స్వాములు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట గ్రామంలో గల పురాతన పద్మావతి అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు పూర్ణకుంభంతో, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తమ గ్రామం నుంచి ఎడ్లబండ్లతో గ్రామస్తులందరం వచ్చే వాళ్లమని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్, జోగు రవి, దేవేందర్, కృష్ణ.. గంగాధర్, బుచ్చన్న, లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాపడిపూజ

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శనివారం రాత్రి అనిల్ చల్లావార్ స్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూరుకు చెందిన సుబ్బారావు గురుస్వామి స్వామివారికి పూజలు నిర్వహించగా.. నిజామాబాద్‌కు చెందిన భజన బృందం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని అయ్యప్పస్వాములతో కలిసి నృత్యం చేశారు.

కౌలు రైతుకు చేయూత అందేనా?

- గత ప్రభుత్వంలో జాడలేని రుణ అర్హత కార్డులు
- అప్పులతో సతమతం
- నాలుగింతలు పెరిగిన కౌలు ధరలు


పత్తి సాగు చేస్తున్న కౌలు రైతు

బజార్‌హత్నూర్: జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వం వారి సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు ప్రవేశ పెట్టలేదు. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం (రైతు బంధు) కూడా పట్టాదారుడి అకౌంట్‌కే వచ్చేంది. కనీసం రుణ అర్హత కార్డులు కూడా లేక కౌలు రైతులు అప్పుల కోసం తిప్పలు పడుతున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో ఎక్కువ వడ్డీకి ప్రైవేట్‌గా అప్పులు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట పండక నష్టపోతే పరిహారం కౌలు రైతుకు బదులు భూయజమానికి వస్తుంది. దీంతో కౌలు రైతు అప్పుల ఊబీలో కూరుకుపోతున్నాడు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

ఆదిలాబాద్ జిల్లాలో 39 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. సొంతంగా సాగుభూమి లేకపోవడంతో పట్టాదారుల నుంచి భూమిని కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నారు. 2011లో కౌలు రైతుల కోసం రూపొందించిన చట్టం సైతం వారిని ఆదుకోవడం లేదు. కౌలు రైతులను గుర్తించి వారికి రుణ అర్హత కార్డులు ఇవ్వాల్సి ఉండగా జిల్లాలో ఎక్కడా కూడా అమలు కావడం లేదు. బ్యాంకు రుణం పొందాలంటే కౌలు రైతుకు భూయజమాని పత్రం ఇవ్వాల్సి ఉంది. కానీ హామీ పత్రం ఇస్తే ఏం జరుగుతుందో అనే భయంతో పట్టాదారులు వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా కౌలు రైతులు పెట్టుబడుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గత మూడేళ్లలో కౌలు ధరలు నాలుగింతలు పెరిగాయి. పంటలకు గిట్టుబాటు ధర రాక కౌలు రైతులు కష్టాల్లో చిక్కుకుంటున్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా కౌలు రైతులకు రైతు భరోసా పథకం వర్తింప చేస్తామని హామీ ఇవ్వడం, రైతులు ఆశలు పెట్టుకున్నారు. కౌ లు రైతులకు రైతు భరోసా పథకం అర్హత, విధివిధానాలు ఎలా ఉండబోతున్నాయోనని ఎదురు చూస్తున్నారు.

అప్పుల పాలవుతున్నాం



ప్రకృతి వైపరీత్యాలతో కౌలు రైతులకు ఏటా నష్టాలే వస్తున్నాయి. బలన్‌పూర్ శివారులో రూ.80 వేలకు 7 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. 4 ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో సోయా వేశాం. అప్పులు చేసి రూ.2.60 లక్షల పెట్టుబడి పెట్టాం. ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు రాక ఆర్థికంగా నష్టపోయాం.
– తాండ్ర శ్రీనివాస్, బజార్‌హత్నూర్

హామీ అమలు చేయాలి



కౌలు రైతుకు రైతుభరోసా పథకం అమలు గురించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కొత్త ప్రభుత్వం పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15 వేలను కౌలు రైతులకు ఇవ్వాలి. యాసంగి నుంచే ఈ పథకాన్ని అమలు చేయాలి.
– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్ వేదిక జిల్లా అధ్యక్షుడు

ఎన్నికలు ఏవైనా గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

- కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి

బేల: ఎన్నికలు ఏవైనా గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, ప్రజల మధ్యనే ఉంటానని, తనపై నమ్మకంతో ఓటేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుంచి ప్రతి కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ ప్రత్యేక చొరవతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి, ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, బాపురావు హుల్కే, ఠాక్రే అశోక్, విలాస్‌పటేల్, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 200మంది చేరిక


పార్టీలో చేరిన వారితో జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని ఉమ్రీ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు 200 మంది జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గారిపై నమ్మకంతో పార్టీలో చేరిన ఉమ్రి గ్రామస్తులను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. వారికి అండగా ఉంటామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ఉమ్రిలో కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బొల్లారం బాబన్న, పెందూరు మాధవ్, వెంకన్న యాదవ్, కమలాకర్, సోమన్న, గంగారం, రామారావుపటేల్, మాధవరావు, ప్రతాప్, గాజుల సాంబశివ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాంసి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ కోరారు. భారత్ సంకల్ప వికసిత్ యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని పొన్నారి, పాలోడి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులకు మౌలిక సదుపాయాల కోసం అమలు చేస్తున్న ఉజ్వలయోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం జన్‌ధన్ యోజన, వైద్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్, అశోక్, ఎంపీటీసీ రఘు, డీఆర్‌డీఏ అధికారి మజీద్, హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.